క్లుప్తంగా

ఫ్యాక్టరీ ఏర్పాటు ఆలోచన విరమించుకోవాలి

మణుగూరుటౌన్: ప్లాస్టిక్ సంచుల రీసైక్లింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కొంత సామగ్రి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో దించారని, దానివల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆ ఆలోచన విరమించుకోవాలని శివలింగాపురం గ్రామస్తులు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. గురువారం గ్రామస్తులు మాట్లాడుతూ... ఫ్యాక్టరీ విషతుల్యమైన ఫ్యాక్టరీగా వివరిస్తూ దాని ఫలితంగా చుట్టు పక్క ప్రజలకు కేన్సర్, ఉదర సంబంధిత వ్యాధులు, గుండె వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీనిని వెంటనే విరమించుకోవాలని కోరారు. తహసీల్దార్ అద్దంకి నరేశ్, మున్సిపాలిటీ కమిషనర్‌కి వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత ఉండొద్దు

గుండాల: మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా అందజేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కొమరం సీతారాములు డిమాండ్ చేశారు. మండలంలో యూరియా కొరతపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందించి, పీఏసీఎస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేల రూపాయల అప్పులు తెచ్చి సాగు చేస్తున్న రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు. రోజుల తరబడి వ్యవసాయ పనులను వదిలిపెట్టి పీఏసీఎస్ నందు పడిగాపులు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు యాసారపు వెంకన్న, పర్శిక రవి, మానాల ఉపేందర్, ఈసం కృష్ణ, వాగబోయిన సుందర్‌రావు, మల్లయ్య పాల్గొన్నారు.

రేగాకు ఎమ్మెల్యే పరామర్శ

కరకగూడెం: ఇటీవల మాతృ వియోగం కలిగిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును గురువారం మండలంలోని కుర్నవెల్లి గ్రామంలో గల ఆయన స్వగృహంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరామర్శించి రేగా మాతృమూర్తి నర్సమ్మ చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అంతకు ముందు వివిధ పార్టీల నాయకులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కాంతారావును పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పినపాక, కరకగూడెం మండలాల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి, రావుల సోమయ్య పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారే..

దమ్మపేట: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. మండల పరిధిలోని బొగ్గంరాజులగుంపు గ్రామానికి చెందిన పొట్ట లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే, గురువారం బొగ్గంరాజులుగుంపు గ్రామంలో మృతుడి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సోయం వీరభద్రం, మన్నెం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

అశ్వాపురం: పినపాక నియోజకవర్గం బూర్గంపాడు మండలంలో శుక్రవారం జరిగే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బూర్గంపాడు మార్కెట్ యార్డులో ఉదయం 11 గంటలకు జరిగే పినపాక నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో మంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: జిల్లాలో ఇటీవలే వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, దుమ్ముగూడెం మండల ఎంఈఓ సమ్మయ్య మట్లాడుతూ.. అనారోగ్య కారణాలతో మృతి చెందిన మోతుక్కూరి ప్రేమ్ సాగర్, గడ్డం చంద్రశేఖర్, పాడెం భద్రయ్యల కుటుంబాలను పరామర్శించడం జరిగిందన్నారు. చిరు సహాయంగా ఒకొక్క కుటుంబానికి రూ.28 వేలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోయం కృష్ణ, హనుమంతరావు, రాజా శ్రీనివాసరావు, జెట్టి పద్మ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘం వితరణ

మణుగూరురూరల్: మండలంలోని బావికూనవరం గ్రామానికి చెందిన తాపీ కూలి రాయల సాంబశివరావు కొన్ని రోజుల క్రితం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో కాలు విరిగింది. ఇంటికే పరిమితం కావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. మణుగూరు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గురువారం బాధితుడిని పరామర్శించారు. అనంతరం వారంతా విరాళాలుగా వేసుకున్న రూ.6వేల నగదును, నిత్యావసర సరుకులను బాధితుడికి వితరణగా అందజేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి భాస్కర్, సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

అందని ఆత్మీయ భరోసా

- దుమ్ముగూడెంలో 1,374 మంది అర్హులు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని ఆత్మీయ భరోసా ఆశావహులు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నారు. సెంట్ భూమి లేని నిరుపేద కూలీలకు ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేలు రెండు విడతల కింద అందచేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. భూమిలేని నిరుపేదలు ఏడాదికి సగటున 20 రోజుల పాటు ఉపాధి హామీ పనులకు వెళ్లే వారిని అర్హులుగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మండలంలోని ఆత్మీభరోసా అర్హులు ఎప్పుడు సాయం అందుతుందా అని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

రైతులకు సరే.. కూలీలకేది?

సాగుకు సంబంధించి భూమి కలిగిన ప్రతీ రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పేరిట ఎకరాకు రూ.6 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసింది. మండల వ్యాప్తంగా ఈ పథకం కింద ఇప్పటి వరకు 16,005 మందికి రూ.26 కోట్ల 06 లక్షల 2వేల 379 (26,08,02,379) నగదును అన్నదాతల ఖాతాలో జమచేసింది. దీంతో అన్నదాతలు పంటల సాగులో బిజీగా మారారు. కాని భూమిలేని పేదలకు ఆత్మీయభరోసా కింద ప్రభుత్వం సాయం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12వేలు సాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

అర్హుల గుర్తింపు..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కోసం రేషన్ కార్డును యూనిట్‌గా సెంటు భూమి లేని నిరుపేదలను అర్హులుగా గుర్తించారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 పని దినాలు పూర్తి చేసి ఉండాలి. అయితే కుటుంబంలోని యజమానిగా ఎవరు ఉన్నా సదరు కుటుంబంలోని మహిళను లబ్ధిదారుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన మండలంలో 1374 మంది అర్హులను అధికారులు గుర్తించి జాబితా రూపొందించారు.

ప్రభుత్వం ఈ ఏడాది జనవరి లోనే మొదటి విడత కింద భరోసా అందచేస్తామని తెలిపినప్పటికీ నేటికి కార్యరూపం దాల్చలేదు.కాగ ఇటీవలే రైతు భరోసా కింద నిధులు లబ్దిదారుల ఖాతాలో జమ కావడంతో ఆత్మీయభరోసా అర్హుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఆశగా ఎదురు చూస్తున్న..



నాకు సెంటు భూమి లేదు. పూరి గుడిసెలో ఉంటున్న. ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తాను. ఆత్మీయభరోసా కింద నేను అర్హురాలినని అధికారులు గుర్తించడంతో ప్రభుత్వం నిరుపేద కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందచేసే సాయం ఎప్పుడు అందుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నాను.

– పెద్దాద పాలమ్మ, వర్క్‌షాపు

భూమిలేని కూలీలను ఆదుకోవాలి..



మా కుటుంబానికి సెంట్ భూమి లేదు. ప్రభుత్వం అందజేస్తానన్నా ఆత్మీయభరోసా పథకం కింద నగదు అందజేసి మా లాంటి పేదవారిని ప్రభుత్వం ఆదుకోవాలి. ఇల్లు కూడా లేదు. తాటాకు ఇంట్లో ఉంటున్న. ప్రభుత్వం భరోసా అందచేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

– తాటి లక్ష్మి, ములకపాడు

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నిరసన


తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సంఘం నాయకులు, ఆదివాసీలు

మణుగూరురూరల్: లంబాడాలకు ఎస్టీ రిజర్వేషన్ రద్దు, సింగరేణి ఓసీ పేరుతో ఆదివాసీ భూములు సేకరించడం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు పట్టణంలో నిరసన ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. సురక్షా బస్టాండ్ నుంచి ఆరంభమైన ర్యాలీ తెలంగాణ చౌరస్తా వరకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో చేశారు. అక్కడి నుండి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు సోలం హరిశంకర్ మాట్లాడారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు సోయం కామరాజు, ఈసాల సురేష్, తాటి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వాగబోయిన చంద్రయ్య దొర, వాగబోయిన శ్రీను, చింతం చంద్రకళ, సాంబశివరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవం

చర్ల: అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవాన్ని గురువారం చర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్లలో చర్ల మండల న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాదులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు కొర్సా కృష్ణార్జునరావు, పర్శిక సోమరాజు మాట్లాడారు. న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఈ వృత్తిని ఎన్నుకున్న వారు నీతి, న్యాయంగా నడుచుకోవాలని, చట్టాలను కాపాడేందుకు ప్రతీ న్యాయవాది కృషి చేయాలన్నారు. ప్రాముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పేద, బడుగు, బలహీనవర్గాల వారి హక్కుల కోసం పాటుపడాలన్నారు. చర్లలోని కొమరంబీం విద్యార్థి నిలయంలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచారు. న్యాయవాదులు పరిటాల సంతోష్, జి.లక్ష్మణ్ కుమార్, ఇర్ప ప్రకాష్, ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, వనవాసీ నిలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


న్యాయవాదుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

జూనియర్ కళాశాల తనిఖీ


పరిశీలకుడు హేమచందర్‌తో ప్రిన్సిపల్ శేషుబాబు, అధ్యాపకులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఇంటర్మీడియట్ బోర్డు పరిశీలకులు హేమచందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో అడ్మిషన్లు, తరగతి గదులు, సైన్స్‌ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. కళాశాల నిర్వహణ తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలో అడ్మిషన్లు పెంచాలని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని పలు అంశాలపై ఆయన సలహాలు, సూచనలు ఇచ్చారు. గత ఏడాది కళాశాలలో 73 ఉన్న అడ్మిషన్లు 100కు పెంచిన ప్రిన్సిపల్ శేషుబాబు, అధ్యాపకులను ఆయన అభినందించారు.

బ్యాగులు వితరణ


కరకగూడెం: విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ అందించిన ఎస్సై, సంస్థ సభ్యులు

కరకగూడెం: ఆధార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తోలెం రమేష్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గొల్లగూడెం, కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, ఆట వస్తువులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కరకగూడెం ఎస్సై పీవీఎన్.రావు మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ఆధార్ స్వచ్ఛంద సంస్థ చేసిన సేవ అభినందనీయమని ప్రసంశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు విజయ్, సురేష్, ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రాధ, శ్రీను, సంస్థ సభ్యులు బట్ట బిక్షపతి, రంజిత్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి వస్తున్నా.. మారని తీరు


సారపాక మూలమలుపు వద్ద గోతులమయంగా ఉన్న ఆర్అండ్‌బీ రహదారి

బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన ఉంది. ఇందిర మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి ఆయన, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హాజరు కానున్నారు. బూర్గంపాడు నుంచి సారపాక వరకు ఆర్అండ్‌బీ రహదారి పూర్తిగా దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సారపాక మూలమలుపు వద్ద పెద్దపెద్ద గోతులతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో స్థానికులు పాడైన కూలర్లు, టీవీలు, వాటర్ క్యాన్‌లు ఆ గోతులలో పెట్టి వాహనాదారులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక చేశారు.

కనీసం గోతులనైనా పూడ్చాలని స్థానికులు కోరిన ఫలితం లేకుండా పోతుంది. మండల కాంగ్రెస్ నాయకులు కూడా ఈ గోతులు పూడ్చాలని ఆర్ అండ్‌బీ అధికారులు కోరిన పట్టించుకున్న నాథుడే లేడు. మండలంలో రాష్ట్రమంత్రుల పర్యటనలున్నా ఆర్అండ్‌బీ అధికారులు కనీసం గోతులు పూడ్చాలనే ఆలోచన కూడా లేదని కాంగ్రెస్ నాయకులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ డాక్టర్ జాన్ మిల్లన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఇంటర్, ఓపెన్ ఇంటర్, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన వారు అగష్టు 12 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలోని స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

దోమ తెరల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం, వినాయకపురం గ్రామ పంచాయతీల్లో పని చేసే కార్మికులకు గురువారం ఉచితంగా దోమ తెరలను పంపిణీ చేశారు. నారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ నాయకుడు జక్కుల రాంబాబు తన సొంతఖర్చులతో కార్మికులకు అందించారు.

నెలాఖరు వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించాలి

బూర్గంపాడు: ఆధార్‌కార్డుల సవరణల కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును ఈ నెలాఖరు వరకు కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) డివిజన్ నాయకుడు పున్నంచంద్ కోరారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని వేలాదిమంది ఆధార్ కార్డులలో సవరణలు చేయాల్సివుందని దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఆధార్ క్యాంపును ఈ నెలాఖరు వరకు కొనసాగించాలని కోరారు.

మజ్జిగ పంపిణీ

మణుగూరుటౌన్: మండలంలోని ఆదివాసీ భవన్ వద్ద మూడో రోజు ఆధార్ క్యాంప్ నిర్వహించిన సందర్భంగా మణుగూరు వాసవీక్లబ్, వనితా వైభవం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఈ కార్యక్రమాన్ని వాసవీక్లబ్‌ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించి సెంటర్ వద్దకు వచ్చిన లబ్ధిదారులకు మజ్జిగ అందించారు. కార్యక్రమంలో బొగ్గవరపు అంజలి, కత్తిరాము, చిట్టూరి శేషుకుమార్, బండారు నర్సింహారావు, కడవెండి విశ్వనాథ గుప్తా, చిత్తలూరి రమేష్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కొమ్మ సత్యనారాయణ–శ్రీదేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రుషిత, జయదీప్, సాయి వర్మలు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు. అనంతరం అన్నదాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటను సుందరంగా తీర్చిదిద్దుతాం


దొంతికుంట చెరువుకట్టపై నడుస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అశ్వారావుపేట: నూతనంగా మున్సిపాలిటీగా రూపొందిన అశ్వారావుపేటను సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఉదయం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ నుంచి దొంతికుంట చెరువు వరకు మార్నింగ్ వాక్ నిర్వహించారు. రహదారి విస్తరణ పనులు ప్రజలకు అసౌకర్యంగా ఉన్నాయెందుకని ఆర్అండ్‌బీ డీఈఈ ప్రకాష్‌ను ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వేగవంతంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ, మున్సిపాలిటీ, మిషన్ భగీరథ, ట్రాన్స్‌కో శాఖల అధికారుల సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంత మార్కెట్ ను సందర్శించి ఆధునీకరించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఆదాయాన్ని పెంపొందించాలని కమిషనర్ నాగరాజుకు సూచించారు. దొంతికుంట చెరువు కట్ట, బతుకమ్మ ఘాట్‌లను సందర్శించారు. 24 గంటలూ కట్టపై నలుగురిని కాపలా ఉంచాలని, ఎవరైనా వ్యర్థాలు వేస్తే వెంటనే ఫైన్ వేయాలని మున్సిపాలిటీ కమిషనర్ నాగరాజును ఆదేశించారు. చెరువులో గుర్రపుడెక్కను తొలగించి ఆహ్లాదంగా తయారు చేయాలని ఇరిగేషన్ డీఈఈ ఏ కృష్ణకు సూచించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. బీసీ బాలికల గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఐటీడీఏ పీఓ రాహుల్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్‌బాబు, తుమ్మ రాంబాబు, బత్తుల అంజి, చిన్నశెట్టి యుగంధర్ తదితరులున్నారు.

అపరిష్కృతంగా ఆధార్ సమస్యలు


ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు గాస్తున్న లబ్ధిదారులు

మణుగూరుటౌన్: మండల కేంద్రంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్ గురువారం ముగిసింది. అయితే ప్రజల ఆధార్ సమస్యలు మాత్రం పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని తెలుస్తోంది. తమ ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, పిల్లలకు కొత్త ఆధార్ కార్డునమోదు వంటి అంశాలపై క్యాంప్‌కు వచ్చిన వేలాది మందికి నిరాశే మిగిలింది. తరచూ ఏర్పడిన సర్వర్ డౌన్ సమస్యకు తోడు వేలాది మంది లబ్ధిదారులకు కేవలం వందల సంఖ్యలోనే లబ్ధి చేకూరినట్లయింది. దీంతో చాలా మంది లబ్ధిదారులు నిరాశతోనే వెనుదిరిగారు.

మూడు రోజుల్లో 504 మాత్రమే..

నాలుగు మండలాల ప్రజలకు సౌలభ్యంగా మండల కేంద్రంలో రెవెన్యూ, మండల పరిషత్ విభాగాల ఆధ్వర్యంలో ఆదివాసీ భవన్‌లో ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. మూడు రోజుల్లో ఆధార్ సేవలు అందింది కేవలం 504 మందికి మాత్రమే. తరచూ సర్వర్ సమస్య ఏర్పడటమే అందుకు కారణమని తెలుస్తోంది. రోజూ వచ్చే వందలాది మంది లబ్ధిదారులకు టోకెన్లు అందించిన అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షించినా పెద్దగా ఫలితం కానరాలేదు.

తిర్లాపురంలో సర్వే షురూ!

మణుగూరుటౌన్: మణుగూరు ఓసీ విస్తరణ భూ సేకరణ నేపథ్యంలో గురువారం తిర్లాపురం గ్రామ భూ సేకరణకు సంబంధించి సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ సర్వేను పర్యవేక్షించగా.. సింగరేణి అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. మొత్తం 813 ఎకరాల భూ సేకరణకు కొమ్ముగూడెం, తిర్లాపురం, రామానుజవరం గ్రామాల్లో భూములు సేకరించనుండగా, కొమ్ముగూడెంలో సుమారు 96 ఎకరాలు సర్వే పూర్తవగా, 46 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఉంది. మిగతా పొలాల్లో40 మంది పట్టదారు రైతులు ఉన్నట్లు గుర్తించారు.

అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలు


అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేసిన దృశ్యం

ములకలపల్లి: డంపింగ్ యార్డుల్లో ఉండాల్సిన ప్లాస్టిక్ వ్యర్థాలు అటవీ ప్రాంతంలో కనిపిస్తున్నాయి. మండలపరిధిలోని మాధారం –పూసుగూడెంలో మధ్యలోని అడవిలో సీతారామ ప్రధాన కాలువ పాసెజ్ పిల్లర్ సమీపంలోని అడవిలో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా డంప్ చేస్తున్నారు. పాత ఇనుప సామాన్లు విక్రయించే దుకాణాల్లోని వ్యర్థాలను ఇక్కడకు తరలిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ వ్యర్థాలను సమీప డంపింగ్ యార్డుల్లో వేయాల్సిఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు గుట్టుచప్పుడుకాకుండా ఇక్కడ పడేసి చేతులు దులుపుకుంటున్నారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నుంచి వేగంగా పయనిస్తున్న ఇసుక లారీలను నియంత్రించాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆది, సతీష్ బాబులు ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధిక లోడులతో అతివేగంగా సమయం సందర్భం లేకుండా పాఠశాలల జోన్ల మీదుగా లారీలు ప్రయాణించడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి పది గంటల వరకు పట్టణంలో ఇసుక లారీలను నిషేధించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, పోసి అజయ్ కుమార్, శ్రీను, నాని, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు ఎంపిక


మణుగూరుటౌన్: పీవీకాలనీలోని ఎక్స్‌లెంట్ బాంబేకాలనీ పాఠశాల విద్యార్థి నవోదయ, సైనిక్ పోటీ పరీక్షకు అర్హత సాధించి సత్తా చాటగా.. మరో విద్యార్థి టీ–20 రైజింగ్ భారత్ క్రికెట్ లీగ్‌కి ఎంపికయ్యాడని కరస్పాండెంట్ జేఎం.ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆరో తరగతి చదువుతున్న గౌతమ్ నవోదయ, సైనిక్ పోటీ పరీక్షలలో అర్హత సాధించి సత్తా చాటాడని తెలిపారు. 9వ తరగతి చదువుతున్న అశ్విన్‌డ్రూప్ టీ20 రైజింగ్ భారత్ క్రికెట్‌లీగ్‌కి ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా ఇరువురు విద్యార్థులను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

అశ్వాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు రెండు నెలల పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దండి రాములు డిమాండ్ చేశారు.

మల్లెలమడుగులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలలుగా నిరుపేద ఉపాధి హామీ కూలీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల సిబ్బందికి కూడా నాలుగు నెలల వేతనాలు రాక వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు.

ఎండుతున్న వరి నారు


గుమ్మడివల్లిలో ఎండిపోతున్న వరి నారుమడి

అశ్వారావుపేటరూరల్: వర్షాభావ పరిస్థితులతో చేతికందే దశలో ఉన్న పచ్చని వరి నారు నిలువునా ఎండిపోతుంది. ప్రతి ఏటా పెదవాగు ప్రాజెక్టుపై ఆధారపడే అన్నదాతలు ఈ ఏడాది వర్షాధారంపైనే ఆశలు పెట్టుకున్నారు. కాగా, గడిచిన కొద్ది రోజులుగా వరుణుడు మొఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు గతేడాది ఇదే రోజు(జూలై 18)న భారీ వరదతో ప్రధాన ఆనకట్టకు గండ్లు పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు కింద సాగు చేసే రైతాంగం వర్షాధారంపై ఆధార పడాల్సి రాగా, ఇదే గ్రామానికి చెందిన చిమడబోయిన వెంకటేశ్వరరావు అనే రైతు తన ఐదు ఎకరాల పొలంలో వరి పంటను సాగు చేసేందుకు రూ.15వేల ఖర్చుతో వరి నారు పెంచుతున్నాడు. వర్షాలు లేక పచ్చగా చేతికందే తరుణంలో కళ్లముందే నిలువునా ఎండిపోతుంది. దీంతో ఆ రైతు దిక్కుతోచని స్థితిలో 'వానమ్మా..వానమ్మా..వానమ్మా.. ఒకసారైనా వచ్చి పోవమ్మా'.. అంటూ.. బ్యాగ్రౌండ్ సాంగ్‌తో ఎండిపోతున్న వరిపైరును చూపుతూ.. సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ వీడియో వైరల్ అవుతోంది.